ప్రజాశక్తి
ఆదివారం 15 డిసెంబరు, 2024
5
శ్రీకాకుళం

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పరవస్తు చిన్నయ సూరి 218 జయంత్యుత్సవాలు ఈ నెల 20న విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు చిన్నయ సూరి సాహితీ పీఠం వ్యవస్థాపకులు తాళ్లూరి విజయ లక్ష్మణ్ తెలిపారు. శనివారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జయంత్యుత్సవాల పోస్టర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజు, ఈవేమన, జంధ్యాల శరత్‌బాబులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నయ సూరి రచనలు పిల్లల్లో సైతం ఆలోచింప జేసేవిగా ఉండేవన్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన సరళమైన బాషలో అందించిన రచనలు నేటికి ప్రాచుర్యం పొందుతున్నాయన్నారు. అటువంటి సాహితీ వేత్తను జయంత్యుత్సవాల సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, రచయితలు పాల్గొనాలన్నారు.

అంతా ఏకగ్రీవమే

- ఒకట్రెండు చోట్ల ఎన్నిక
- 344 సంఘాలకు గానూ 342 చోట్ల ఎన్నిక పూర్తి
- 22 చోట్ల ఆగిన ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నిక
- ఎన్నికలను బహిష్కరించిన వైసిపి

సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. అత్యధిక సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. టిడిపిలోనే రెండు గ్రూపుల మధ్య పోటీ నెలకొనడంతో ఒకట్రెండు చోట్ల ఎన్నిక నిర్వహించారు. వైసిపి ఎన్నికలను బహిష్కరించడంతో ఎక్కడా ఆ పార్టీ సానుభూతిపరులు పోటీకి దిగలేదు. దీంతో అత్యధిక సంఘాలను టిడిపి కూటమి సానుభూతిపరులు దక్కించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒలు పర్యవేక్షించారు.



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా ఉన్న 344 సాగు నీటి సంఘాల పరిధిలోని 2628 ప్రాదేశిక నియోజకవర్గాలకు (టిసి) ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, 2606 టిసిలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. వివిధ కారణాలతో 22 చోట్ల ఎన్నికలు జరగలేదు. వంశధార ప్రాజెక్టు పరిధిలోని సంతబొమ్మాళి మండలం మేఘవరం, సరుబుజ్జిలి, ఎస్.ఆర్.కె.పురం, నరసన్నపేట మండలం కోమర్తి టిసిలకు ఎన్నికలు జరగలేదు. అదేవిధంగా మైనర్ సాగునీటి సంఘాలకు సంబంధించి హిరమండలం గులుమూరు, సునాముడి గెడ్డ, చీపిగెడ్డ, పలాస మండలం చీపురుపల్లి, పెద్దలక్ష్మీపురం, టిడ్డిమి, సంచాం, బెన్నాలి తదితర 18 టిసిలకు ఎన్నికలు నిర్వహించలేదు. 344 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, రెండు సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. రణస్థలం మండలం సంచాంలో ఫార్మా కంపెనీ కోసం భూ సేకరణ చేయడంతో అక్కడ సంఘానికి ఎన్నిక అవసరం పడలేదు. అదేవిధంగా మెళియాపుట్టి మండలం చీపురుపల్లిలో ఆఫ్‌షోర్‌లో భూములు కలిసిపోవడంతో అక్కడా ఎన్నిక అవసరం పడలేదు.

టిడిపిలోనే పోటీ

కొత్తూరు మండలంలో మండలంలో ఎక్కడా పోటీ ఉండకూడదని, అన్నీ ఏకగ్రీవం అవ్వాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు టిడిపి నాయకులకు ఆదేశించినా పోటీ దిగారు. మండల కేంద్రంలో రెండో టిసికి ఇరువురు నామినేషన్ వేయడంతో ఎన్నికలు నిర్వహించారు. 252 ఓట్లకు గాను, 30 ఓట్లు పోలయ్యాయి. 30 ఓట్లు సారిపిల్లి నాగభూషణరావుకు పడ్డాయి. కులశేఖర్‌కు ఒక్క ఓటూ పడలేదు. శ్రీకాకుళం రూరల్ మండలం శిలగాం సింగివలసలో టిడిపిలోనే ఇద్దరు నాయకులు పోటీ పడటంతో ఎన్నిక అవసరం పడుతుందని అంతా భావించారు. వారి ఇద్దరి మధ్య రాజీకుదిర్చడంతో ఏకగ్రీవమయ్యింది.

ఎన్నికలను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పర్యవేక్షించారు. ముగ్గురు ఆర్‌డిఒలతో శనివారం ఉదయం నుంచి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వంశధార, జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయం చేసుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా చూశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత గెలుపొందిన సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

పారిశ్రామిక వాడలో స్థానికులకే ఉద్యోగాలు

పరిశ్రమలశాఖ మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పారిశ్రామిక వాడలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలోని డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ శిక్షణ కేంద్రంలో అధికారులతో, మందుల పరిశ్రమల యాజమాన్యాలతో శనివారం సమావేశం నిర్వహించారు. పరిశ్రమ యాజమాన్యాలు కలుగుతున్న ఇబ్బందులు, వారికి ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం, వారు ఈ ప్రాంతంలోనూ చే పడుతున్న కార్యక్రమాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రాభివృద్ధి ఎంతో అవసరమని, అందుకు పారిశ్రామిక అబివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అనంతరం మాట్లాడుతూ పాత పరిశ్రమల అభివృద్ధి, కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వపరంగా ఏ విధంగా సహాయ, సహకారాలు అందించాలని అంశాలపై యాజమాన్యాలతో చర్చించామని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ఆరోగ్యవంతమైన పరిస్థితులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. పైడి భీమవరం పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భజలాలు తక్కువగా ఉన్నాయని, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే అవసరమైన శిక్షణ, ధ్రువపత్రాలు అందజేసి వారిని నిష్ణాత్తులుగా తయార ంచేసి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే విధంగా సూచించామని అన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా... వాటిని పరిష్కరించి పారిశ్రామిక వాడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వేధింపులు ఆపకుంటే ఉద్యమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులకు పెంచిన మస్టరు పాయింట్లను తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, యూనియన్ నాయకులతో చర్చించి సమస్య వెంటనే పరిష్కారించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాంలు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు కార్మికులపై అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం రెండో రోజు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న మూడు మస్టర్ పాయింట్ల స్థానంలో కొత్తగా ఐదు మస్టర్ పాయిం ట్లుగా మార్చడంతో కార్మికులు ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు వివరించినా పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టాలు చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వకుండా వేధించడం తగదన్నారు. పనిముట్లు పూర్తిగా ఇవ్వ కుండా పనిచేయాలని వేధింపులు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పుష్కాట్లు, బిన్నులు పెద్ద కాంపాక్టరు వెహికల్స్ రిపేర్ ఉన్నా పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తమ వైఖరి మార్చుకొని కార్మికుల సమస్య పరిష్కారం చేయాలని లేకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, ఆకుల శంకరరావు, ఎ.రాము, డి.యుగంధర్, ఎ.శేఖర్, ఎ.జనార్ధన్, ఎ.గురుస్వామి, జె.మాధవి, ఎ.రాజేశ్వరి, పార్వతి, ఈశ్వరమ్మ, డి.చిట్టి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,894 కేసుల రాజీ

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

కోర్టుల చుట్టూ తిరుగుతూ ఎంతో విలువైన కాలాన్ని, వ్యయాన్ని వృథా చేసుకోకుండా, పంతాలు పట్టింపులు వీడి రాజీపడి లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించికోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మొత్తం మీద 19 బెంచీలు నిర్వహించామని, రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు జిల్లా అంతటా అదాలత్‌ల్‌లో పరిష్కారమయ్యాయని అన్నారు. లీగల్ సర్వీసులను ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్, పారా లీగల్ వాలంటీర్స్ నియమించామని అన్నారు. వీటి ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు మార్గం సుగమం అయిందన్నారు. లోక్ అదాలత్‌ల్లో ఇచ్చిన తీర్పులు అంతిమతీర్పులని, వీటిపై అప్పీల్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జిల్లా మొత్తం 2894 కేసులు రాజీ అయ్యాయని అన్నారు. సివిల్ కేసులు 138, దీనిలో రూ.31,46,8043, బైక్ ప్రమాదాల్లో 43 కేసులు, రూ. 27,07,4000, క్రిమినల్ కేసులు 2694, రూ. 46,06,020, ప్రీ లిటిగేషన్ కేసులు 62, రూ.33,37,042 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. అనంతరం కచ్చిదారులకు ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసి నాయుడు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణి కుమార్, సీనియర్ న్యాయవాది ఇందిరాప్రసాద్, న్యాయ మూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పాల రైతుల నిరసన

నిరసన తెలుపుతున్న పాల రైతులు

ప్రజాశక్తి- రణస్థలం

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు సేకరణ ధర వెంటనే పెంచాలని, పాలుకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. మండలంలోని వేల్పురాయిలో ఎపి పాల రైతుల సంఘం ఆధ్వర్యాన ఆవు పాలు సేకరణ ధర తగ్గించడాన్ని నిరసిస్తూ పాల రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తగ్గించిన ఆవు పాలు ధర పెంచాలని డిమాండ్ చేస్తూ... ఈ నెల 16న శ్రీకాకుళంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల రైతులు పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ డెయిరీ రైతుల నుంచి పాల సేకరణ ధర లీటరుకు రూ.3 నుంచి రూ.5కు తగ్గించారని అన్నారు. ఇప్పటికే పాల ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. గడ్డి, దాణా, పశువైద్యం, కృత్రిమ గర్భధారణ అన్నింటికీ ధరలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, పాల సేకరణ పెంచకుండా తగ్గించడం అన్యాయమన్నారు. రావాల్సిన ప్రయోజనాలు అన్నింటినీ రాబట్టేందుకు పాల రైతులందరూ ఐక్యంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఇ కృష్ణమూర్తి

ఇంధన పొదుపు తప్పనిసరి

ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇంధనాన్ని పొదుపుగా వాడటం ద్వారా భవిష్యత్ అవసరాలకు తోడ్పాటు అవతుందని, అందులో ప్రధాన అవసరంగా ఉన్న విద్యుత్ వినియోగాన్ని పొదుపు చేసుకోవాల్సిన అవసరం ఉందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పరిషత్ నుంచి పొట్టి శ్రీరాములు కూడలి మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకూ విద్యుత్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు శనివారం ప్రదర్శన నిర్వహించారు.

ఈ ప్రదర్శనను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ దేశంలో విద్యుత్ వినియోగం పెరిగిపోతోందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుని సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని వివరించారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా పురుత్పత్తికి వీలున్న సౌరశక్తిని వినియోగించుకోవాలని సూచించారు. ఇంధన పొదుపు ప్రాధాన్యతను వివరిస్తూ ఏటా డిసెంబరు 14 నుంచి వారం రోజులపాటు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను కేంద్ర ఇంధన వనరుల మంత్రిత్వశాఖ నిర్వహిస్తోందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఇఇలు సురేష్ కుమార్, యోగేశ్వరరావు, భయన్నాయుడు, ఆనంద్, పలువురు డిఇలు, ఎఇలు, ఇతర సిబ్బంది, వినియోగదారుల సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

- రూ.48 వేలు నగదు సీజ్
- రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: ఒడిశా నుంచి అక్రమంగా ఆటోలో ఇద్దరు వ్యక్తులు 22 కిలోల గంజాయి తరలిస్తుండగా శనివారం అరెస్టు చేసినట్లు సిఐ రామారావు, ఎస్ఐ పిన్నింటి రమేష్ బాబులు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక మహేంద్ర తనయా వంతెన వద్ద అనుమానంగా ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులతో ఉన్నారని అన్నారు. బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి బయటపడినట్లు తెలిపారు. గజపతి జిల్లా ఆడాఊరు గ్రామానికి చెందిన జోసఫ్ బీర్, విశాఖపట్నానికి చెందిన అప్రోచ్ ఆలంగా గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, రూ.48 వేలు నగదు సీజ్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.44 వేలు వరకు అంచనా వేశామన్నారు. గంజాయి పట్టుకున్న సిబ్బందికి అభినందించారు.

ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే సహించేది లేదు

మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రోటోకాల్ ఉల్లంఘన జరుగుతున్నాయని, ఇదే కొనసాగితే సహించేది లేదని ఎంపిపి ఉంగ ప్రవీణ, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి, ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయి, వైస్ ఎంపిపి తలగాస శ్రీరాములు, బొడ్డపాడు ఎంపిటిసి మద్దిల పాపారావు, అమలకుడియ సర్పంచ్ కొర్ల శిరీష, చినంచల ఎంపిటిసి బి.దుర్యోధనలు మాట్లాడారు. ఇటీవల కాలంలో ప్రోటోకాల్ ఉల్లంఘన ఎక్కువుగా జరుగుతుందన్నారు. పంచాయతీల్లో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా అక్కడి సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు పిలవడం లేదని అన్నారు. అభివృద్ధి కార్యాక్రమాల్లో శిలాఫలకాల్లో పేరు వేయకుండా ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతుండడం సహజమేనని, ప్రభుత్వాలు మారినంత మాత్రాన పంచాయతీల్లోని ప్రజా ప్రతినిధులకు గౌరవించకపోవడం అన్యాయమని అన్నారు. సమావేశాల్లో అజెండాలో పెట్టిన అంశాలన్నింటిని తాము అమోదిస్తూ అభివృద్ధికి ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. కానీ, టిడిపి నాయకులు అక్కడ ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వకుండా టిడిపి కార్యకర్తలే కార్యక్రమాలు చేపట్టడం నరికాదన్నారు. దీనిపై ఎంపిడిఒ కె.వసంత్‌కుమార్ సమాధానం చెబుతూ తాము అందరికీ పిలవాలనే చెబుతున్నామని, తప్పును సరిదిద్దే ప్రయత్నం చేస్తామని తెలిపారు. వైస్ ఎంపిపి మాట్లాడుతూ తాను ఐదు ఎకరాలు భూమిలో వరి సాగుచేశానని, ఒక ఎకరానికి మాత్రమే అనుమతి వచ్చిందని, మిగిలిన నాలుగు ఎకరాల పంట ఎక్కడ విక్రయించాలని వ్యవసాయ అధికారులకు ప్రశ్నించారు. తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మరో రెండు నెలల్లో కొత్త రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో బ్రాహ్మణతర్లా, తర్లకోట, అల్లుకోలసర్పంచ్‌లు బాడాన పుష్ప, కొర్ల సంతోష్, దువ్వాడ వామాక్షి, ఇఒపిఆర్‌డి ఎం.వైకుంఠరావు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

జిల్లా నేతల చెవికెక్కని జగన్ బోధనలు

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపిని ఓటమి నిస్తేజం వీడినట్లు లేదు. ఆరు నెలల తర్వాత కూడా ప్రజలకు ముఖం చూపించడానికి కొందరు నేతలు ఇష్టపడటం లేదు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ప్రజల ముందు టిడిపి కూటమి ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే అవకాశం వచ్చినా చేజార్చుకుంది. అన్నదాతను దగా చేస్తున్న కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్వహించిన ర్యాలీ, ధర్నాకు జనసమీకరణ చేయడంలో జిల్లా పార్టీ పెద్దలు వైఫల్యమయ్యారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. శ్రీకాకుళం నగరంలో చేపట్టిన ర్యాలీకి హాజరైన కార్యకర్తలు, నాయకులు అంతా కలిపి 500 దాటకపోవడం నేతల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలో ఒక్కో నియోజకవర్గం నుంచి పట్టుమని వంద మందినీ తీసుకురాలేకపోవడం నాయకత్వంలో నెలకొన్న నైరాశ్యానికి అద్దం పడుతోంది. జిల్లాలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎన్నికల ఫలితాల తర్వాత ఇంటికే పరిమితమయ్యారు. ఎన్నికల్లో ఓటమి నుంచి బయటపడలేకపోవడం పార్టీకి మైనస్‌గా మారింది. శ్రీకాకుళం నియోజకవర్గంలో 50 వేల ఓట్లపైగా తేడాతో ఓడిపోవడాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. ఒక సర్పంచ్ చేతిలో ఓడిపోవడం, అదీ దారుణ ఓటమి చవిచూడటం తీవ్ర అవమానంగా భావిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు ఇంతగా తిరస్కరించడమేమిటని? ఎంత చేసినా జనాలకు కృతజ్ఞత లేదని అనుచరులు వద్ద వాపోతున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని ఎన్నోసార్లు ప్రవచించిన ధర్మాన ఆయనే ఓటమి నైరాశ్యంలో కూరుకుపోవడం పార్టీ శ్రేణుల్లో మరింత నిస్తేజం ఆవరించింది. దాని ఫలితమే నియోజకవర్గం నుంచి కొంత మంది నాయకులు హాజరైనా కార్యకర్తల భాగస్వామ్యం పెద్దగా కనిపించలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసంపై వైసిపి ఇచ్చిన పిలుపునకు ఆయన నాయకత్వం వహించి దాని ప్రభావం వేరేగా ఉండేది. జనంలోకి రావడానికి ఇంతకు మించిన అవకాశం ఏముంటుంది? రైతుల సమస్యలపై పోరాడమన్న పేరు అటు ధర్నాకు, ఇటు పార్టీకి వచ్చేది. ఆయన గైర్హాజరు కావడంతో ఆ అవకాశం జార విడుచుకున్నట్లయింది.

వైసిపి ప్రభుత్వ హయాంలో శాసనసభ స్పీకర్‌గా ఒక వెలుగు వెలిగిన తమ్మినేని సీతారాం గైర్హాజరు కావడం కొంత చర్చకు దారి తీసింది. తనయుడు చిరంజీవి నాగ్ ఆరోగ్యం కోసం అమెరికా వెళ్లడంతో ఆయన రాలేకపోయారని తెలిసింది. ఆయన రాలేకపోయినా ఆ పార్టీ శ్రేణులు కదిలి వచ్చేలా ఒక మెసేజ్ ఇవ్వకపోవడంతో అక్కడి నుంచి పెద్దగా కార్యకర్తల భాగస్వామ్యం కనిపించలేదు. గత ప్రభుత్వ కాలంలో మంత్రి పదవీ బోగం అనుభవించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తీరూ అలానే ఉంది. మంత్రిగా ఉన్న సమయంలో టిడిపి, ఆ పార్టీ నేతలపై విరుచుపడిన అమాత్యునిలో ఇప్పుడు ఆ స్పీడ్ కనిపించడం లేదు. మంత్రిగా ఉన్నప్పుడు వందలాది మందిని పోగేసుకుని వెళ్లే సీదిరి అప్పలరాజు, ఇప్పుడు 50 మందినీ తీసుకురాలేక పోయారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వైఖరి పరిస్థితి మరీ దారుణంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నాకు తనను పిలవలేదని జిల్లా నాయకత్వం నిందించడం ఆయనకే చెల్లింది. ఎమ్మెల్సీగా ఆయనే నాయకత్వం వహించి శ్రేణులను తరలించాల్సిన దువ్వాడ తన పిలవలేదని వెళ్లకపోవడాన్ని అంతా తప్పుపడుతున్నారు. టెక్కలిలో ఇటీవల పార్టీ కార్యాలయం ప్రారంభానికి హాజరు కాకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గం సీటిచ్చి, ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే కష్టకాలంలో ఉన్న పార్టీకి, ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటమేమిటని పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు మినహా పెద్దగా శ్రేణులు రాలేదు.

వైసిపి హయాంలో ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి పదవులు అనుభవించిన ధర్మాన కృష్ణదాస్ పార్టీకి, జగన్‌కు వీరవిధేయుడన్న పేరు దక్కించుకు న్నారన్న పేరు తప్ప జిల్లా పార్టీని సమర్థవంతంగా నడిపించలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. వైసిపి అధికారంలో ఉన్నప్పుడే జిల్లాలో పాతపట్నం, ఎచ్చెర్ల, టెక్కలి నియోజకవర్గాల్లో వైసిపిలో కమ్ములాటలు, గ్రూపుల పోరు మనం చూశాం. చివరకు ఆయన సొంత నియోజకవర్గంలోనూ ఎన్నికలకు కొద్ది నెలల ముందు అసమ్మతి జ్వాలలు ఎగిసిపడటం, కొంత మంది నియోజకవర్గ ముఖ్య నాయకులు పార్టీని వీడటం మనం చూశాం. వాటిని ఏనాడూ చక్కదిద్దేందుకు చొరవ తీసుకున్న పాపాన పోలేదు. వైసిపి అధికారం కోల్పోయిన తర్వాత ఆయన మాటను ఎవరూ పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు హాజరైతే అదే పదివేలు అని భావించినట్లుగా కనిపిస్తోంది. అందుకే ఏ నియోజకవర్గానికీ పెద్దగా లక్ష్యాలు విధించలేదని తెలిసింది.

జిల్లాలో ధాన్యం కొనుగోలు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు 1.70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలూ పూర్తిగా తెరుచుకోని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 402 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 370 కేంద్రాలే తెరుచుకున్నాయి. వరుస అల్పపీడనాలు, వర్షాలతో ధాన్యం దాచుకునే అవకాశం లేక, ప్రభుత్వం పరంగా కొనుగోలు జరగక దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఇటీవల కాలంలో మనం చూశాం. ఈ నేపథ్యంలోనే రైతుల సమస్యలపై పోరాడటానికి పార్టీ అధిష్టానం పిలుపు నిచ్చింది. రైతుల ఆవేదనను వ్యక్తపరచడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఇంతకు మించి వేదిక ఏముంటుంది? నేతలంతా కూడబలుకున్నట్లుగా ఏదో జిల్లా కేంద్రంలో ధర్నా జరిపామన్న రీతిలో నిర్వహించి మమ అనిపించారు. ఎన్నికల ఫలితాల్లో తమకు 11 సీట్లే వచ్చినా 40 శాతం ఓటింగ్ వచ్చిందని అధినేత ఓ పక్క చెప్తుంటే జిల్లాలో మాత్రం ఆ రకమైన స్పందన కనిపించడం లేదు. ప్రతిపక్ష హోదా కోసం న్యాయ స్థానాల్లో సైతం పోరాడుతున్న వైసిపి, జనం సమస్యలపై ప్రజా క్షేత్రంలో పోరాటాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లుగా కనిపించడం లేదు. మనమంతా పోరుబాట పట్టాలని, ప్రజలకు దగ్గరవుతూ పోరాటాల్లో వాళ్లకు తోడుగా నిలబడిగలిగితే మనకు సానుకూలంగా తయారవుతుందని పార్టీ అధినేత ఒక పక్క దిశానిర్దేశం చేస్తుంటే... ఇక్కడి నేతలకు అవి చెవికెక్కినట్లు కనిపించడం లేదు. ఇప్పటికైనా జిల్లా నేతలు మేల్కొని ప్రజా పోరాటాల్లో పెద్ద ఎత్తున శ్రేణులను భాగస్వామ్యం చేయడం, ప్రజా వ్యతిరేక విధానాలపై టిడిపి కూటమిని నిలదీయడం చేయాల్సి ఉంది. అప్పుడే ఆ పార్టీ అధినేత చెప్పినట్లుగా ప్రజల్లో వారిపై సానుకూలత ఏర్పడుతుందన్న విషయం గుర్తించాలి.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

శ్రీకాకుళం అర్బన్ : అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

బూర్జ : అధ్యక్షులను అభినందిస్తున్న రామకృష్ణనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గ పరిధిలో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో 18 నీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో శాసనసభ్యులు గొండు శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఏకగ్రీవమైన నీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు అభినందించారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగాయి. 18 నీటి సంఘాలు టిడిపి కైవసం చేసుకోవడంతో టిడిపి నాయకులు ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికార యంత్రాంగానికి, రైతులకు, కూటమి నాయకులు, టిడిపి నాయకులకు ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.

పొందూరు: మండలం పరిధిలోని తొమ్మిది సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల్లో అన్ని సంఘాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. సాగునీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులకు ఎమ్మెల్యే కూన రవికుమార్, మండల టిడిపి అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

లావేరు : మండలంలోని 13 సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అన్నీచోట్ల ఏకగ్రీవంగానే టిసిలను అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను ఎన్నికల నోడల్ అధికారి, తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్ని పోలింగ్ కేంద్రాల్లోను పరిశీలించి ఎన్నికల అధికారులకు సూచనలు చేశారు. దీంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు తహశీల్దార్ తెలిపారు.

కవిటి: నీటి సంఘాల ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. తాహశీల్దార్ మురళీమోహన్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పర్యవేక్షించారు. ఈ క్రమంలో మండలంలోని 30 టిసిలకు 30 టిసిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బూర్జ: మండలంలోని 12 టిసిలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తహశీల్దార్ పద్మావతి తెలిపారు. ఎన్నికైన వారికి మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ నాయుడు, మండల అధ్యక్షులు రాంజీ, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

ఎచ్చెర్ల: మండలం కేశవరావుపేట పంచాయతీలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఇఒ సిహెచ్ లావణ్య, ఎఇఒ, పిఒ మొదలవలస లక్ష్మీనారాయణ సమక్షంలో నిర్వహించారు. సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జి.సిగడాం: మండలంలో నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. 219 టిసిలు ఉండగా 201 టిసిలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 18 టిసిలకు పోటీ పడ్డారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు తహశీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. నిద్దామ్‌లో నీటి సంఘం ఎన్నికలో స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకోవటంతో స్థానిక ఎస్ఐ వై మధుసూధనరావు పోలీస్ బందోబస్తు నడుమ ఎన్నిలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రాదేశిక సభ్యులకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు ధ్రువపత్రాలను అందించారు.

ఆమదాలవలస: మండలంలో 4 నీటి సంఘాలు, 30 టిసిలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సంఘ సభ్యులకు రిటర్నింగ్ అధికారులు ధ్రువపత్రాలను అందజేశారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ పాండ్రంకి సత్యనారాయణ, ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ ఎస్.రాంబాబు ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నూకరాజు, టిడిపి నాయకుడు తమ్మినేని అమర్నాథ్, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సనపల అప్పలనాయుడు, నరసింహారావు, చెల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలో టిడిపి బలపర్చిన వ్యక్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు నియామకపత్రాలు అందజేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోండా ఎస్ఐ వి.సత్యనారాయణ, పోలీసులు గట్టి బంధోబస్తు ఏర్పాటు చేశారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 16 నీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సిఐ మీసాల చిన్నంనాయుడు ఆధ్వర్యాన ఎస్ఐలు చిన్నంనాయుడు, శ్రీనివాస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, కొండ శంకర్‌రెడ్డి, ఎల్.పద్మనాభం, రెయ్యి జానకిరావు, దక్కత ఢిల్లీరావులు అభినందనలు తెలిపారు.

పోలాకి : మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, వంశధార డిఇ శ్రీహరి ఆధ్వర్యాన ప్రశాంతంగా నిర్వహించారు. ఆరు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మెళియాపుట్టి : మండలంలో 17 నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్ని సంఘాలూ కూటమి అభ్యర్థులు చేజిక్కించుకున్నారు. వీరికి మాజీ ఎంపిపి సలాన మోహనరావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, శ్రీనివాస్‌రెడ్డి, రేఖానవాసులు అభినందించారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండలంలోని 15 నీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. టిడిపి మద్దతుదారులంతా గెలుపొందారు. వీరిని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావులు అభినందనలు తెలిపారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రిట్టపాడు -1, 2 మైనర్ ఇరిగేషన్ నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిసి సభ్యుల ఎన్నికలను అధికారులు నిర్వహించారు. ఒక్కొక్క నీటి సంఘానికి ఆరుగురు చొప్పున 12 మంది టిసిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గెలుపొందిన అభ్యర్థులకు టిడిపి నాయకులు దువ్వాడ హేమబాబు చౌదరి, బి.శశిభూషణ్, విశ్వనాథం, దుర్యోధనలు అభినందనలు తెలిపారు.

నందిగాం : మండలంలోని 12 టిసిలు ఏకగ్రీవమయ్యాయని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నికల అధికారులు నియామకపత్రాలను అందజేశారు. వీరికి మండల నాయకులు అభినందనలు తెలిపారు.

కొత్తూరులో ఎన్నిక...

కొత్తూరు : మండలంలో 24 సాగునీటి సంఘాలు ఉండగా, అందులో వసప, కొత్తూరు, అంగూరు, వెంకటాపురం, మాతల సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలినవి ఏకగ్రీవం ఎన్నికయ్యారయ్యారు. మండలంలో ఎక్కడా పోటీ ఉండకూడదని, అన్నీ ఏకగ్రీవం అవ్వాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు టిడిపి నాయకులకు ఆదేశించారు. అయినా పోటీ నెలకుంది. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలను టిడిపి నాయకులు దిక్కరించినట్లయ్యింది. మండల కేంద్రంలో టిసి రెండుకూ కుల శేఖర్ అల్వార్ నామినేషన్ వేసి ఎన్నికలో పాల్గొనకుండా బహిష్కరించారు. ఇరువురు నామినేషన్ వేయడంతో ఎన్నికలు నిర్వహించారు. 252 ఓట్లుకు గాను, 30 ఓట్లు పోలయ్యాయి. 30 ఓట్లు సారి పిల్లి నాగభూషణరావుకు పడ్డాయి. కులశేఖర్‌కు ఒక్క ఓటు కూడా పడలేదు. ఇక్కడ ఒక సీటు పోటీ అయింది. మిగతా ఐదు సీట్లు ఏకగ్రీవమయ్యాయ. దీంతో అధ్యక్షునిగా గోగుల చిట్టిబాబు, ఉపాధ్యక్షులుగా లోతుగడ్డ ఆనందరావులను ఎన్నుకొన్నారు.

పాతపట్నం: మండలంలో నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 18 టిసిలకు 18 టిసిలు ఏకగ్రీవమయ్యాయి.

సోంపేట: మండలంలోని నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. 13 సంఘాలకుగాను 13 సంఘాలు ఏకగ్రీవమయ్యాయి.

టెక్కలి: మండలంలోని 12 నీటి సంఘాల ఎన్నికలకు 12 సంఘాలు ఏకగ్రీవమైనట్టు తహశీల్దార్ దిలీప్‌చక్రవర్తి తెలిపారు.

పొందూరు : ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

లావేరు : తాళ్లవలస నీటిసంఘం కార్యవర్గంతో అధికారులు, సిబ్బంది

కోటబొమ్మాళి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న తహశీల్దార్

పోలాకి : నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ సురేష్‌కుమార్

ఇచ్ఛాపురం : నాయకులతో మాట్లాడుతున్న సిఐ చిన్నంనాయుడు

పలాస : నిరంజన్‌ను సన్మానిస్తున్న వెంకన్న చౌదరి

కొత్తూరు : ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు

వినతిపత్రం అందజేస్తున్న సాధన కమిటీ సభ్యులు

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

సుమారుగా 45 గ్రామాల ప్రజలు ఆధారపడుతున్న బారువ రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, పాసింజర్లు నిలుపుదల చేయాలని సాధన కమిటీ అధ్యక్షులు రామ్‌బుడ్డి గణపతి కోరారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ద్వారా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యం కోసం నిత్యం వందలాది మంది విశాఖపట్నం, హైదరాబాద్, బెంగుళూర్, ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ ప్రాంతాలకు వెళ్తుంటారని అన్నారు. అందుకు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని విన్నవించారు. సోంపేట మండలంలోని ఏకైక రైల్వే స్టేషన్ బారువను అభివృద్ధి చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి రత్నాల శ్రీనివాసరావు, మల్యాల యాదవరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అధ్యాపకునికి సన్మానం

పోలాకి: ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తములకు ఎప్పుడూ ప్రాముఖ్యత ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నరసన్నపేట జూనియర్ కళాశాల వృక్ష శాస్త్రం అధ్యాపకులు ఆరంగి అప్పన్నకు శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృక్షశాస్త్రంలో మంచి ప్రతిభ కనబరిచినందుకు నవంబరు 11న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమని అన్నారు.

మూడేళ్లలో కిచెన్ ఉత్పత్తుల వృద్ధి లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాబోయే మూడేళ్లలో తమ కిచెన్ ఉపకారణాల ఉత్పత్తులకు సంబంధించి 20శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్టు గోద్రెజ్ ఇంటీరియో కన్స్యూమర్ విభాగ ప్రాంతీయ ప్రతినిధి డా.దేవ్ నారాయణ్ సర్కార్ చెప్పారు. మండల వీధిలో సోమ ఇంటీరియర్స్‌లో ఏర్పాటు చేసిన గోద్రెజ్ ఇంటీరియో కిచెన్ స్టోర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం పట్టణ వాసులకు తమ మొదటి స్టోర్‌ను ఇక్కడ అందుబాటులో తీసుకువచ్చామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై 25) నాటికి స్టోర్ ఆదాయం ఏడాదికి రూ.60 లక్షలకు చేరుతుందని భావిస్తున్నామన్నారు.

అత్యాధునిక ఫీచర్లతో టికెఎం క్యామ్రీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్యుత్ వాహనాల పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధినాతన ఫీచర్లతో టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. శనివారం పెదపాడు టయోటా మోటార్స్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్బన్ న్యూట్రల్ లక్ష్యాలను సాధించడంలో తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, పూర్తి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనం అధునాతన 5వ తరం హైబ్రిడ్ టెక్నాలజీని కలిగి ఉందన్నారు. ఈ కొత్త మోడల్ అత్యాధునికమైన సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన ఎక్స్‌టీరియర్స్ ఇంటీరియర్‌లు, సౌకర్యవంతమైన సాంకేతికత అనుసంధానితతో సాటిలేని అధునాత నతను తెస్తుందన్నారు. తద్వారా ఆల్ న్యూ క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనం వినియోగదారుల అంచ నాలను మించిన అనుభవాలను అందిస్తుందన్నారు.

'పోయెట్రీ'లో రాజారావు ప్రతిభ

ఆమదాలవలస: పట్టణానికి చెందిన రచయిత, కవి కుప్పిలి వెంకట రాజారావుకు నేషనల్ లెవల్ పోయెట్రీ కాంటెస్ట్‌లో ర్యాంక్ లభించింది. నవంబర్ నెలలో ఎస్-7 పోయెట్రీ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఆన్‌లైన్ ఇంగ్లీష్ పోయెట్రీ కాంటెస్ట్‌లో కె.వి.రాజారావు రచించిన 'డార్క్ సీన్' పోయెమ్‌కు 139వ ర్యాంకు లభించింది. దేశంలో వెయ్యి మందికిపైగా పాల్గొన్న ఈ కాంటెస్ట్‌లో కుప్పిలి కనబర్చిన సృజనాత్మకతను ప్రశంసిస్తూ ర్యాంక్ సర్టిఫికేట్‌ను గూగుల్ నిర్వాహకులు పంపినట్లు రాజారావు తెలిపారు. రాజారావుకు ఈ ర్యాంకు రావడంపై పట్టణంలోని సాహితీ అభిమానులు అభినందనలు తెలియజేశారు.

మండల కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

బూర్జ: మండల పరిషత్ కార్యాలయంలో మండల కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఉన్నుకున్నారు. అధ్యక్షులుగా మురళీ మోహనరావు, గౌరవ సలహాదారుగా అజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పి.చంద్రబాబు నాయుడు, ఎం.రోహిణి, ప్రధాన కార్యదర్శిగా జి.కల్యాణ బాబు, కోశాధికారిగా బలివాడ కిరణ్ కుమార్, జిల్లా బాధ్యులు ఎం.అమర్నాథ్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన పొట్నూరు శ్రీనివాసరావు (నీల్ కమల్‌శ్రీను) రూ.1,11,111 విరాళాన్ని శనివారం అందజేశారు. సోంపేటకు చెందిన తన బందువులు సాన సుశీల, భర్త పకీర్ తరపున ఆయన శనివారం అరసవల్లి సందర్శించి ఆలయ సీనియర్ సహాయకులు ఎ.శ్రీనివాసరావుకు అందజేశారు.

శర్వాణిలో ప్రాజెక్టు డే

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లిలో గల శర్వాణి స్కూల్‌లో శనివారం ప్రాజెక్టు డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ విద్యాసంస్థల డైరక్టర్ జి.సంయుక్త, శర్వాణి విద్యాసంస్థల చైర్మన్ అందవరపు సూరిబాబు, విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావులు హాజరై ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ ఆంజనేయులు, హెడ్మిస్ట్రెస్ డా కె.రేఖ మాట్లాడుతూ విద్యార్థికి సర్వతో ముఖాభివృద్ధితో పాటు డ్యాన్స్, యోగా, కరాటే, మ్యూజిక్‌తో పాటు ప్రత్యేక నిపుణులతో బోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు డేను ప్రారంభిస్తున్న సంయుక్త

తూర్పుకాపుల అభివృద్ధికి తోడ్పాటు

ఉద్యోగులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత విద్యాధికులుగా ఎదిగి తూర్పుకాపు సామాజిక తరగతి అభివృద్ధికి తోడ్పడాలని తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో జిల్లా తూర్పుకాపు ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రతి నోటిఫికేషన్‌ను అర్హులైన యువకులు దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షలకు తగ్గట్టు తర్ఫీదు పొంది ఉద్యోగాలను సాధించాలన్నారు. అందుకు అవసరమైన తోడ్పాటు తూర్పుకాపు సంక్షేమ సంఘం, ఉద్యోగుల సంఘం అందిస్తాయన్నారు. జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన తూర్పుకాపు సామాజిక తరగతి అన్ని రంగాల్లో వెనుకబడి వుందన్నారు. ఉద్యోగుల సంక్షేమ సంఘంలో పెద్దఎత్తున సభ్యులను చేర్పించి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ఉద్యోగులను సత్కరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంఘం నేత కరణం చిన వెంకట రమణ, మక్కా శ్రీనివాసరావు, దాసరి రామచంద్రరావులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా తూర్పుకాపు అధ్యయన వేదిక అధ్యక్షులు శాసపు జోగినాయుడు, సంఘ ప్రతినిధులు డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పడాల తమ్మునాయుడు, అంకడాల తవిటన్న, కిల్లారి నారాయణరావు, వాళ్తేటి సత్యనారాయణ, వాళ్ల శ్రీరాములు నాయుడు, కురిటి దుర్గారావు, పి.వసంతరావు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శివ్వాల చంద్రశేఖర్, బాడాన చిన్నారావు రూ.50 వేలు విరాళాన్ని భవన నిర్మాణానికి అందజేశారు.

లోకేష్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రెంటికోటకు చెందిన అంగవైకల్యం కలిగిన క్రీడాకారుడు మంత్ర లోకేష్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించి సిక్కోలు సత్తాను చాటారు. థాయిలాండ్‌లో డిసెంబరు 1 నుంచి 7 వరకు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి హైజంప్ పోటీలలో మెదటి స్థానంలో నిలిచి బంగారు పతకం పొందారు. లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ పొందారు. దీంతో పలాస పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలిపారు. ఈ మేరకు లోకేష్ స్వగ్రామానికి శనివారం చేరుకోవడంతో మున్సిపాలిటీ నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనకు రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, పలువురు పెద్దలు లోకేష్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. క్రీడాకారుడిగా ఈ ప్రాంత ఖ్యాతీని చాటినందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మేహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష లోకేష్‌కు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి గౌతు శివాజీ, నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి, ఎపిటిసిసి చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు, సప నవీన్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, డొక్కరి శంకర్, నాగార్జున హరికృష్ణ, టంకాల రవిశంకర్ అభినందనలు తెలిపారు.

సన్మానిస్తున్న నాయకులు

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రమాణ స్వీకారం

అభినందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని రాజపురానికి చెందిన భాస్కర గౌడ శనివారం అమరావతిలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కార్పొరేషన్ ద్వారా తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా భాస్కర్‌గౌడను టిడిపి మండల నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, బి.శ్రీనివాసరావు, ఎం.శశిభూషణరావు, ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో ఇరువురికీ న్యాయం

పొందూరు : లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి జ్యోత్స్న

ప్రజాశక్తి- పొందూరు

లోక్ అధాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్ కేసులు 56, ఎక్సైజ్ కేసులు 75, పెట్టీ కేసులు 83, సివిల్ కేసులు 4 మొత్తం 218 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అధాలత్ మెంబర్‌గా జి.అశోక్, న్యాయవాదులు బ్రహ్మాజీ, కిరణ్, రామ్మోహన్, సురేష్, రాము, పొందూరు, జి.సిగడాం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

247 కేసులు...

పలాస : పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి ఆధ్వర్యాన నిర్వహించిన లోక్ అదాలత్‌లో 247 కేసులు రాజీ అయ్యాయి. వీటిలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాలోని ఎక్సైజ్ కేసులు 159 కేసులు రాజీ చేసి వారి నుంచి రూ.7,25,800 అపరాధ రుసుం వసూలు చేశారు. మున్సిపల్ యాక్టు కేసులు 11 రాజీ చేసి వారి నుంచి రూ.25,89,493 అపరాధ రుసుం వసూలు చేశారు. మనోవర్తి కేసులు రెండు రాజీ పడగా, ఎన్ఐ యాక్టు కేసులు 9 రాజీ అయ్యాయి. ఐపిసిలో రాజీ పడదగ్గ కేసులు 53 రాజీ చేశారు. మొత్తం క్రిమినల్ కేసులు 234 రాజీ పడగా, సివిల్ భూతగాదా కేసులు 13 రాజీ కాగా, క్రిమినల్, సివిల్ కేసులు రాజీ అయ్యాయి. పిపి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.విశ్వేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

208 కేసులు...

ఇచ్ఛాపురం : రాజీ మార్గమే సరైన మార్గమని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జ్ పి.ఫరీష్ కుమార్ అన్నారు. కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 208 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పి.వరలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నందికి రమణయ్య, దేవరాజిరెడ్డి, గిన్ని సీతయ్యారెడ్డి, భగవాన్‌దాస్, సత్యనారాయణ, సత్యనారాయణ పాడి, నాగరాజు పాత్రో, మనోజ్, భైరాగిరెడ్డి, రంగారావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి ఫరీష్‌కుమార్

సోంపేట : స్థానిక కోర్టులో సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యాన లోక్ అదాలత్ నిర్వహించారు. రెండు బెంచ్‌లు ఏర్పాటు చేయగా, సివిల్ జడ్జిలు జె.శ్రీనివాసరావు, ఎ.రాములు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఫ్రీ లిటిగేషన్ కేసులు, మద్యం, సివిల్ దావాలు పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం కక్షిదారులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.ఎస్.విజయ్‌కుమార్, డి.నందగోపాల రావు, ఎం.సర్వేశ్వరరావు, జి.ఎస్.శైలేంద్ర, జోగారావు, ఎస్.వి.మూర్తి, జి.పున్నయ్య, కె.వి.ఆర్ పాల్గొన్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాలుగు ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కోటిపల్లిలో శనివారం ఉదయం సంభవించిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పల్ల సన్యాసమ్మ ఇంటిలో గ్యాస్‌లీకై మంటలు చెలరేగగా, పక్కనే ఉన్న పురిళ్లుకు వేగంగా మంటలు వ్యాపించి క్షణాల్లో అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను ఆర్పేందుకు గ్రామానికి చెందిన యువకులు ప్రయత్నించి నప్పటికీ సాధ్యం కాలేదు. ప్రమాద సంఘటన వద్దకు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని పూర్తిగా మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో పల్ల సన్యాసమ్మ, పల్ల లక్ష్మీ, పల్ల అసిరినాయుడు, పల్ల మంగమ్మలకు చెందిన పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో ఉన్న నిత్యవసర సరుకులతో పాటు, నగదు, బంగారు ఆభరణాలు, బట్టలు కాలిపోవడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డామంటూ బాధితులు రోధించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల విలువైన ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అగ్నిప్రమాద బాధితలను ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించారు. కాలిపోయిన ఇళ్లకు పక్కా గృహాలను మంజూరు చేస్తామని బాధితులకు హామీఇచ్చారు. ఈయనతో రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు ఉన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పోలాకి: మండలంలోని జడూరూ పంచాయతీలో నేషనల్ హైవేకి ఆనించి ఉన్న ఓ గృహంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శనివారం దాడి చేవామని జి.రంజిత్ తెలిపారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించగా, ఇద్దరు నిర్వాహకులు, ఒక మహిళ, ఒక విటుడు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారిని అదుపులో తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఇచ్ఛాపురం : ప్రభుత్వం నిర్దేశించిన ధరల కన్నా అధికంగా మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. మద్యం అమ్మకాలపై గట్టి నిఘా పెట్టామన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. డిసెంబరు నెలలో ఇప్పటి వరకు ఇప్పటి వరకు చేపట్టిన దాడుల్లో ఎనిమిదిపై కేసు నమోదు చేశాన్నారు. ఒడిశా మద్యం సీసాలు 36, పెయిడ్ లిక్కర్ 34 సీసాలు, 27 లీటర్ల ఒడిశా నాటుసారా, 18.5 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

పాతపట్నం: పాతపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం అక్రమ మద్యం నిల్వలపై దాడులు నిర్వహించి, విక్రయాలు జరిపేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. మద్యం అక్రమంగా కలిగివున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనధికారికంగా మద్యం అక్రమ రవాణా చేయడం, విక్రయాలు జరపడం నేరమని, అట్టి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుంటామన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియ జేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడ తాయన్నారు.

పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ లావణ్య

ఎస్‌సి కులగణన చేపట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సిల జీవన విధానం, పరిస్థితులపై పూర్తిస్థాయిలో కులగణన నిర్వహించాలని, ఎస్‌సి వర్గీకరణతో మాలలకు తీవ్ర నష్టం కలుగుతుందని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల దుర్గారావు అన్నారు. నగరంలోని ఇలిసిపురం అంబేద్కర్ మందిరంలో దళిత మహాసభ, దళిత హక్కుల పరిరక్షణ సమితి, మాల ఉద్యోగుల సంఘం ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్‌సిల మధ్య చిచ్చుపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలను చేయడం తగదన్నారు. వర్గీకరణ వల్ల ఎస్‌సిలోని 59 ఉపకులాల్లో రెండు, మూడు కులాల ప్రయోజనం కోసం మిగిలిన వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. ఎస్‌సిలకు రావాల్సిన బ్యాక్‌లాగ్ పోస్టులు, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న పథకాల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ఎస్‌సి వర్గీకరణ చేయకుండా ఎస్‌సిల అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు గంజి ఆర్ ఎజ్రా, దండాసి రాంబాబు, అంపోలు ప్రతాప్, శీర రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దుర్గారావు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం చినమేరంగి ప్రతాప్‌నగర్ కాలనీలో ఈనెల 2న అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబ బాధితులకు తెలకల సంఘం జిల్లా అధ్యక్షులు జి టి ఎస్ ప్రసాద్ ప్రధాన కార్యదర్శి రావుపల్లి చంద్రశేఖర్ రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ నగదును కుటుంబ యజమాని సింహాచల కు అందజేశారు. కార్యక్రమంలో తెలకలి సంఘం చినమేరంగి పెద్దలు మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ శివప్రసాద్ బ్రహ్మ ఉన్నారు.

ప్రభుత్వం దిగి రావాలి

పార్వతీపురం: ప్రభుత్వం వెంటనే గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యకులు మువ్వల అమరనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జరిగిన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సామూహిక నిరాహార దీక్షల్లో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గిరిజన విద్యా రంగాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్లేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను గిరిజన గురుకులాలకు ఎలా డెప్యూటేషన్ వేస్తారని ప్రశ్నించారు. ఈ చర్యల వల్ల అటు గురుకులాల్లోనూ, ఇటు ఆశ్రమాల్లో గిరిజన విద్యార్థులకు చదువులేని పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇటువంటి అనాలోచిత, అశాస్త్రీయ ఆలోచనలు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు రంజిత్ కుమార్, గణపతి, భగవాన్, అవుట్ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, వెంకట్, రాజేష్, రమేష్, కామేష్, మురళి, లక్ష్మి జ్యోతి, కవిత, దీప, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన వీరేష్

కురుపాం: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో తన నివాసం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో గల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు లేనటువంటి పాఠశాలన్నిటికీ సహకరించి మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు.

మరణానంతరం సజీవం

అంగీకార పత్రాన్ని అందజేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైద్య విద్యార్థుల ప్రయోగాలకు మరణానంతరం మృతదేహాన్ని అందజేస్తానన్న ఉపాధ్యాయురాలు ఆరంగి విజయ్ కుమారి (58) గతంలో అంగీకారం తెలిపారు. ఆమె అంగీకారం మేరకు శనివారం మరణానంతరం రిమ్స్ వైద్య కళాశాలకు ఆమె కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలంను కలిసిన ఆమె కుమారుడు విజయ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల అనాటమీ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ కె.వి రాంప్రసాద్, డాక్టర్ ఎం.హేమ రాధిక, డాక్టర్ తరణి, తదితరులు హాజరయ్యారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి - కవిటి

తమ సమస్యల పరిష్కారానికి కవిటి బస్టాండ్ ఆవరణలో బెంతు ఒరియాలు చేస్తున్న నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా 354వ రోజు శనివారం దీక్షల్లో కొక్కిలిపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, త్వరితగతిన హామీలు నెరవేరిస్తే తమ విద్యార్థుల ఉన్నత చదువులకు, నిరుద్యోగుల కొలువులకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే తమకు పూర్తి న్యాయం జరిగే వరకూ దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

దీక్షలో పాల్గొన్న కొక్కిలిపుట్టుగ గ్రామస్తులు

సిఆర్‌పిఎఫ్‌కు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు

మండలం బురిడికంచరాంకు చెందిన మడపాన రవితేజ, మీసాల సాయిరాజ్‌లు సెంట్రల్ గవర్నమెంట్ ఎస్ఎస్‌సి జిడిలో సిఆర్‌పిఎఫ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరిని తల్లిదండ్రులు కాయకష్టం చేసుకుంటూ చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉద్యోగాలు సాధించడంతో యువకులను గ్రామస్తులు అభినందించారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కొండవూరుకు చెందిన చలపాకుల పాపారావు ఇటీవల హైదరాబాద్‌లో సంభవించిన ప్రమాదంలో మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మైటీ హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం మృతిని కుటుంబ సభ్యులకు రూ.12,500లు శనివారం ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కోటిపల్లి రాకేష్, కో-ఆర్డినేటర్ రాజేష్, అశీష్ పాల్గొన్నారు.

చంద్రరావుతో మాట్లాడుతున్న తిలక్

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ రామకృష్ణాపురం గ్రామ వార్డు మెంబర్ మెట్ట చంద్రరావు తండ్రి మల్లేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. ముందుగా మల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతికి గల కరణాలు అడిగి తెలుసుకొని సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూక సత్యరాజు, వార్డు సభ్యులు కృష్ణమూర్తి, మూల చంద్రరావు, మెట్ట అప్పలనాయుడు, దుంపల వెంకన్న, అవల పోలినాయులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ అభిమానుల సంబరాలు

శ్రీకాకుళం అర్బన్: సినీ నటుడు అల్లు అర్జున్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన నేపథ్యంలో ఆందోళనకు గురైన ఆయన అభిమానులు శనివారం ఉదయం ఆయన విడుదలతో ఊరట చెందారు. అందులో భాగంగా అల్లు అర్జున్ అభిమాన సంఘం అధ్యక్షులు నవీన్ ఆధ్వర్యాన వివిధ ఆలయాలను సందర్శించారు. జైలు నుంచి విడుదలయ్యారని తెలిసిన వెంటనే బాణసంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ గిరి, భాను, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న అల్లు అర్జున్ అభిమానులు

విలేకరిపై దాడికి వ్యతిరేకంగా రాస్తారోకో

ప్రజాశక్తి - సాలూరు

కడప సాక్షి విలేకరి పై టిడిపి నాయకుల దాడికి నిరసనగా శనివారం పట్టణంలో జాతీయ రహదారిపై విలేకరులు రాస్తారోకో నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ విలేకరుల పై దాడులు చేయడం దుర్మార్గమని చెప్పారు. అనంతరం తహశీల్దార్ ఎస్ వి రమణ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు విశ్వేశ్వర రావు, చంద్రమౌళి, కృష్ణారావు, నాగేశ్వరరావు, కూర్మారావు పాల్గొన్నారు.

పరిశీలనకు వెళ్లా... పారిపోలేదు : తహశీల్దార్

ప్రజాశక్తి - మక్కువ

నీటి సంఘ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా పోలింగ్ బూత్‌లను పరిశీలించేందుకు శుక్రవారం వెళ్లానని, అంతేగాని ఎక్కడికీ పారిపోలేదని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం విలేకరులకు తెలిపారు. రాజకీయ పార్టీలు వారి హక్కుల ప్రకారం ఆందోళన చేయడం పరిపాటేనని, అలాగని వారు చేసే ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. టిడిపి తరపున పోటీ చేసే వారికి శుక్రవారం రాత్రి నో డ్యూయల్ ఇచ్చానని ఆరోపించడం సరికాదన్నారు. పనసభద్ర బూత్ పరిశీలన సాయంత్రం ఆరు గంటలకు పైబడిందని అనంతరం సమయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వ్యక్తులు తప్పకుండా రసీదులు చూపించాలని ఎన్నికల జీవోలో ఉందన్నారు. కన్నంపేటలో నామినేషన్లు తిరస్కరణ విషయమై ప్రస్తావించగా, నిబంధనల మేరకే తిరస్కరించినట్లు అక్కడ అధికారులు తెలిపారని అన్నారు.

ఒడిశా ఎస్ఆర్‌పి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఒడిశాలోని కోరాపుట్ జిల్లా హై స్కూల్ టీచర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ బాసిక్ నాయక్ మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ, పరిసరాలు, పాఠశాల విద్యా బోధన చూసి ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణంలో కూరగాయలు, పూలతోటల పెంపకం చూసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పాలక దేవానంద్, ఉపాధ్యాయులు గణేష్ ఉన్నారు.

పసికందు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

ప్రజాశక్తి - సీతంపేట

నవజాత శిశువుల ప్రాణ రక్షణలో 108 అంబులెన్స్ ఆపద్బాంధవుగా నిలుస్తోంది. అత్యవసర వేళ అపర సంజీవనిలా ప్రత్యక్షమవుతోంది. అనారోగ్యంతో ఉన్న పసికందును ఆగమేఘాలపై ఆసుపత్రికి చేరుస్తోంది. ప్రాణాపాయం నుంచి తప్పించి తల్లిదండ్రులకు ఆనందాన్ని పంచుతోంది. చిన్నారుల మరణాల కట్టడిలో కీలక భూమిక పోషిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

మండలంలోని తోటగూడకు చెందిన సవర శారద రెండో కాన్పు నిమిత్తం సీతంపేట ప్రభుత్వాసుపత్రిలో చేరింది. శనివారం తెల్లవారుజాము నుంచి నొప్పులు ఆగి వస్తూ ఉండడంతో 10 గంటల సమయంలో పండంటి బాబుకు జన్మను ఇచ్చింది. అయితే ఆ నవజాత శిశువు ఉమ్మనీరు తాగడంతో పుట్టిన వెంటనే ఏడవలేదు. ఎటువంటి కదలికలు లేవు.. ఆ సమయంలో చిన్నపిల్లలు వైద్యనిపుణులు సుభాష్, మనోజ్ కుమార్ శిశువుకు ఇన్క్యూబేట్ చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పాలకొండ నవజాత శిశు అంబులెన్సు సిబ్బంది ఇఎంటి జి.గణపతి, పైలట్ మురళి స్పందించి బేబీని అంబులెన్సులోకి తీసుకుని ఇఆర్‌సిపి డాక్టర్ రవి సూచనలు మేరకు అత్యవసర చికిత్సను ఇస్తూ, అంబులెన్స్ బ్యాగ్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్ కు సకాలంలో తరలించారు. మార్గమధ్యలో పసికందుకుకదలికలు కూడా రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం బాబు ప్రాణాపాయం నుండి బయటపడి, వెంటిలేటర్ ద్వారా చికిత్స పొందుతున్నాడు.

ఆక్సిజన్ సాయంతో శిశువును తరలిస్తున్న 108 సిబ్బంది